క్లుప్తంగా

## మోటార్ల మరమ్మతు చేయండి

**మక్తల్:** మండలంలోని పారేవుల దగ్గర సత్య సాయి తాగునీటి సరఫరా చేసే మోటర్లకు మరమ్మతు చేయాలని చిట్యాల సర్పంచ్ జానకి అన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మోటర్లు కాలిపోయి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్నంతవరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఎప్పుడైతే మిషన్ భగీరథ పరిధిలోకి తీసుకున్నారో అప్పటి నుంచి అధికారులు ఏ సమస్య వచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటిని ఫిల్టర్ చేయడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



**నారాయణపేట రూరల్:** మండలంలోని జాజాపూర్ పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన హోమంలో దంపతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జలాధివాసం, ధాన్యాధివాసం, శయ్యేధివాసం, ప్రదేశవాహనం తదితర పూజా కార్యక్రమాలు చేసి, దేవతాస్థాపన, అగ్నిహోత్రం చేపట్టారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు, సీఐ రవిబాబు, ఎస్‌ఐ సురేస్‌గౌడ్‌లు హాజరై పూజలు చేశారు. ఆలయ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

**మాగనూర్:** మాగనూర్, మక్తల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన వారికి సోమవారం నారాయణపేట జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎండీ ఉమర్ 8 మందికి రూ. 12500ల జరిమానా విధించినట్లు మాగనూర్ ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మాగనూర్:** మండల కేంద్రంలోని 33 కేవీ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దేవేంద్ర నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, కోల్పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నర్వ తహసీల్దార్‌గా రాజగనేషణ్

**నారాయణపేట:** మండల తహసీల్దార్ రాజగనేషణ్ (ఎఫ్‌ఏసీ)ను నియమిస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న దయాకర్ రెడ్డిని నారాయణపేట కలెక్టరేట్‌కు, నర్వ మండల డిప్యూటీ తహసీల్దార్‌ను మక్తల్ ఈపీఐ సీగా నియమించారు.

## రూ.2.5 లక్షలు మంజూరు

**మరికల్:** యువక మండలి భవనంలో కనీస సౌకర్యాల కల్పనకు మంజూరైన నిధులు రూ. 2.5 లక్షల ప్రొసిడింగ్‌ను సోమవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, మాజీ యువక మండలి అధ్యక్షుడు ఆంజనేయులుకు అందజేశారు. ఈనిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కొనసాగుతున్న వీఓఏల దీక్ష

**మక్తల్:** పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 29వ రోజు సోమవారం వీఓఏల నిరసన దీక్ష కొనసాగింది. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## నిత్యావసరాల ధరలు తగ్గించాలి

**ధన్వాడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిత్యవసర తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ అన్నారు. సోమవారం బీజేపీ కో హఠావో దేశ్ కో బచావో లో భాగంగా సోమవారం మండలంలోని కోండ్రోనిపల్లిలో ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ‘సీఎం కప్’

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- పల్లెల్లో యువత ఆసక్తి కనబర్చాలి



మక్తల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్:** గ్రామీణ ప్రాంతాల్లో యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సీఎం కప్–2023 మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆణిముత్యాలను వెలికి తీయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఉత్తమ పదర్శన కనబర్చిన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, డీవైఎస్‌ఓ కృష్ణామాచారి, కమిషనర్ మల్లికార్జున్, ఎంఈఓ వెంకటయ్య, సీఐ సీతయ్య, విశ్రాంత పీఈటీ గోపాలం, పీఈటీలు సాయినాథ్, సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, రమేష్, రూప, రాజేశ్వరి, అంబ్రేస్, పరంజ్యోతి, వరలక్ష్మి, వెంకటేష్, సునీత, శేఖర్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక సమావేశం..**

మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్రజలకు మంచి వైద్యం చేయాలని సిబ్బందిని కోరారు. 150 పడకల ఆస్పత్రి కోసం 919 సర్వే నెంబర్‌లో 4ఎకరాల 22 గుంటల భూమిని కేటాయించామన్నారు. రూ.15లక్షలతో నవజాత శిశువుల కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశామని తెలిపారు. 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి హరీశ్‌రావు చేతుల మీద ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రూ.10 లక్షలతో వెయిటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. సమావేశంలో చైర్‌పర్సన్ పావని, డాక్టర్లు చక్రధరణ్‌గౌడ్, పార్వతి, మున్వర్‌అలీ, శ్రీధర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**మాగనూర్:** గ్రామీణ క్రీడాకారులకు ఆటపై ఆసక్తి కల్పించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇప్పటికే గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసిందని జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం మండల కేంద్రంలోని క్రీడాప్రాంగణంలో మండల స్థాయి సీఎం కప్‌– 2023 ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీపీ శ్యామలమ్మ, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణా:** మండల కేంద్రంలో సోమవారం సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీలను ఎంపీపీ పూర్ణిమపాటిల్, ఎంపీడీఓ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఇది గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివప్ప, సర్పంచ్ రాధ మహాదేవ్, సిబ్బంది చక్రపాణి, ఏపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు తిమ్మప్ప, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేటి నుంచి..**

**ధన్వాడ:** మండలంలోని క్రీడాకారులకు నేడు చీఫ్ మినిస్టర్ కప్ 2023 పోటీలను బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ సద్గుణ తెలిపారు. ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు పాల్గొనాల్సిందిగా కోరారు. 15ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సున్న క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

**దామరగిద్ద:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ శశికళ, పీఈటీ వెంకటప్ప తెలిపారు. ఖోఖో, వాలీబాల్, 100 మీటర్ల, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.



మాగనూర్‌లో..



కృష్ణాలో..

# నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు



పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**మరికల్:** రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో మరికల్ నుంచి రాంకిష్టాయ్యపల్లి వరకు వేసిన బీటీరోడ్డును ప్రారంభించారు. అనంతరం పెద్దచింతకుంటలో మహిళా సమాఖ్య భవనం ప్రారంభించి, గ్రంథాలయం, యూత్ భవనం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా జిల్లా తలరాత మార్చిన ఘనత ఈ రాజేందర్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు అమలుచేసి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.

**ఎమ్మెల్యే రాకముందే పూజ..**

మండలంలోని వెంకటాపూర్‌లో వ్యవసాయ గోదం నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయాల్సిండగా, ఆయన రాకముందే పాలక మండలి సభ్యులు పూజ కార్యక్రమాలను చేసి వాట్సప్‌లో పెట్టారు. ఇది కాస్తా ఎమ్మెల్యేకు తెలిసింది. దీంతో వెంకటాపూర్ కాకుండా నేరుగా పెద్దచింతకుంటలో జరిగే కార్యక్రమాలకు వెళ్లారు. అక్కడికి వెళ్లిన తీలేర్ సింగిల్‌విండో పాలకవర్గ సభ్యులు, ఆ గ్రామ పార్టీ నాయకులు వెంకటాపూర్‌కు రావాలని ఎమ్మెల్యేను ఎంత బతిమిలాడినా వెళ్లలేదు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, ఎంపీటీసీలు మంజుల, గోపాల్, విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, బసంత్, మల్లేష్, రామస్వామి, హన్మిరెడ్డి, రాజేష్, రవి, సంపత్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

**మాగనూర్:** సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగనాథ్‌రెడ్డి అన్నారు. పల్లె పల్లెకు వీజేఆర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వర్కూర్‌లో పర్యటించారు. గతంలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు విన్నవించగా వెంటనే ఆయన స్పందించి పెద్ద వాగు నుంచి గ్రామం వరకు సుమారుగా రూ. 8 లక్షలతో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే పనులు ముగింపు దశకు చేరకున్నాయి. మంగళవారం వాగులో బోరును ప్రారంభించేందుకు అన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సోమవారం స్టాటర్, కేబుల్ వైర్‌లను గ్రామస్తులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణయ్య, నర్సింహులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



స్టాటర్‌ను అందజేస్తున్న వర్కటం జగనాథ్‌రెడ్డి

# అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండా



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట రూరల్:** అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, శాసన సభ్యులు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. అప్పక్‌పల్లి – కోయిలకొండ రెండు వరసల రహదారి పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.56 కోట్లు మంజూరయ్యాయన్నారు. కోటకొండతో పాటు పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలను కలుపుతూ నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నాణ్యతతో పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేపూరిరాములు, ఎంపీపీలు అమ్మకోళ్ళ శ్రీనివాస్‌రెడ్డి, శశికళ, జెడ్పీటీసీ విద్యాసాగర్, విండో, మార్కెట్ చైర్మన్ నర్సింహారెడ్డి, జ్యోతి, వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, జెడ్పీ కో ఆప్షన్ తాజోద్దీన్, నాయకులు వెంకట్రాములుగౌడ్, గందె చంద్రకాంత్, కన్నజగదీష్, బండిశివరాంరెడ్డి, లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, మల్లయ్యయాదవ్, జయలక్ష్మి, వెంకటమ్మ, సుదర్శన్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## విరాళాల సేకరణ



విరాళం అందజేస్తున్న దాత వన్నడ వెంకటప్ప

**దామరగిద్ద:** మండలంలోని గత్పులో అండేడ్కర్ విగ్రహా ఏర్పాటుకు స్ఫూర్తి సేవా సంఘం ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన దాత వన్నాడ వెంకట్పప్ప రూ. 21 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి కమిటీ సభ్యుడు సర్పంచ్ రాములు, శివప్ప, భరత్, రవి, బుగ్గప్ప, రమేష్, మోహన్‌లు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు తగదు

**నారాయణపేట టౌన్:** భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి కుటుంబానికి అందించాలనే మహాధర్నా చేస్తుంటే నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ డేవిడ్ మహరాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆపార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తుండగా పోలీసులు నాయకులకు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారద మహారాజ్ పిలుపు మేరకు 15 రోజులుగా ప్రతి ఒక్కరికి రాజ్యాంగాన్ని ఉచితంగా ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్, మండల తహశీల్దార్లకు వినతి పత్రాలు అందించామన్నారు. అరెస్ట్ అయినవారిలో ఓబులేష్, గోపాలకృష్ణ, శ్రీనివాస్, ఈశ్వర్, తాయప్ప, వెంకటేష్, వేణు, అరుణ్, నర్సింహులు, ఆంజనేయులు, కళాజ్యోతి ఉన్నారు.

## వ్యక్తి అదృశ్యం



కోట్ల బాల్‌రాజ్

**ఊట్కూర్:** మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి చెందిన కోట్ల బాలరాజ్ (45) అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ వివరాల ప్రకారం బాలరాజ్ ఈ నెల 3 వ తేదీ పనినిమిత్తం మక్తల్‌కు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి భార్య నర్సమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు.

# మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న హన్మేష్

**నారాయణపేట:** మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని, మెజార్టీ వర్గాల వాళ్లు మైనార్టీ వర్గాలపై దాడి చేసి అణచివేత గురిచేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని జిల్లాలో పీడీఎస్‌యూ వ్యవస్థాపకుల్లో ఒకరు హన్మేష్ పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి అధ్యక్ష వర్గంగా కాలేశ్వర్, దేవేందర్, జట్రం వెంకటేష్, అంబదాస్, సల్మాన్ ఉండగా జిల్లాలో హన్మేష్, రాము, సీహెచ్ రాంచందర్, ఖలీల్ తదితరులు మాట్లాడారు. 1988 నుంచి 2023 వరకు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో పనిచేసిన అందరూ ఈ సమావేశానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. 1988లో పీడీఎస్‌యూ జిల్లాలో ప్రారంభించే సమయంలో భూస్వామ్య పెత్తందారి భావాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో తీవ్రమైన ఘర్షణలు పడ్డామన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు ప్రగతిశీల భావవ్యాప్తి చేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశీనాథ్, ఎస్.కిరణ్, సాయికుమార్, జయలక్ష్మి, విజయ, సౌజన్య లక్ష్మి, నరసింహ, నారాయణ, భగవంతు, భాస్కర్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**మరికల్:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం యోగా మహోత్సవం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యోగా ద్వారా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేస్తే మనిషికి ఎలాంటి వ్యాధులు రావని అన్నారు. రామచంద్ర మిషన్, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత యోగా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, ఎంపీటీసీ గోపాల్, యోగ శిక్షకులు లిల్లీ, ఆంజనేయులు, లక్ష్మి, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# రాజకీయ అంశాలపై అవగాహన



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్

**నారాయణపేట టౌన్:** జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ స్వామి ఆలయ అవరణంలో సోమవారం రాజకీయ అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్ హాజరై అవగాహన కల్పించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. శిక్షణ తరగతులో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్, బాల్‌రాం, ఆంజనేయులు జోషి, శివకుమార్, కాశప్ప, నరహరి, బొమ్మన్‌పాడ్ బాల్‌రాం, హన్మంతు, మోహన్ వెంకటప్ప పాల్గొన్నారు.

## రెండు జింకల మృతి

**మక్తల్:** మండలంలోని ఖానాపూర్‌లో రెండు జింకలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలోని వ్యవసాయ పొలంలో కంచెకు చుట్టుకొని మృతిచెందినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘటన స్థలానికి ఫారెస్ట్ అధికారులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతి చెందిన జింకలను అధికారి నిలేస్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.

## ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

**ధన్వాడ:** మండల కేంద్రంలోని రామలింగేశ్వర, గణేష్ ఫర్టిలైజర్ షాపుల్లో సోమవారం ఏఓ ప్రదీప్ కుమార్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాపులో ఏమైనా నకిలీ విత్తనాలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే సరైన ధ్రువపత్రాలు కలిగి ఉన్నారా లేదా అని విత్తన ప్యాకెట్లు, ఎరువులు, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రైతులు వ్యవసాయమే జీవనాధారంగా బతికే వారికి నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మి మోసం చేస్తే షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మి పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో ప్రతి ఒక్కరూ రశీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సైమన్ తదితరులు ఉన్నారు.

# ఉపాధి కూలీల డబ్బులు చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**నారాయణపేట టౌన్:** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్కు వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, సలీం మాట్లాడుతూ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐపీకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, చెన్నప్ప, సహాయ కార్యదర్శి కనకరాయుడు, కోశాధికారి హాజీమలంగ్, తాయప్ప, రామాంజనేయులు, సాయిలు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



వైట్‌పేయింట్ వేయిస్తున్నా సీఐ సీతయ్య

**కృష్ణా:** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటునట్లు సీఐ సీతయ్య అన్నారు. సోమవారం మండలంలోని 167 జాతీయ రహదారి గుడెబల్లూర్, టైరోడ్డు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట వైట్ పేయింట్‌తో పాటు రంబుల్ స్ట్రిప్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు రోజుల నుంచి పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

# విధుల్లో చేరిన సెక్టోరియల్ అధికారులు

**నారాయణపేట రూరల్:** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో పాఠశాలల పర్యవేక్షణ, నిర్వహణ నిమిత్తం రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేసిన సెక్టోరియల్ అధికారులు సోమవారం విధుల్లో చేరారు. ఈ ఏడాది జనవరి 8న జరిగిన పరీక్షలో ఎస్ఓ–1 (ప్లానింగ్, డైస్)కు నలుగురు పరీక్ష రాయగా ముగ్గురు క్వాలిఫై అయ్యారు. వీరిలో బొమ్మన్‌పాడు స్కూల్ హెచ్‌ఎం నాగార్జున్‌రెడ్డి ఎంపికయ్యారు. అదేవిధంగా ఎస్ఓ – 4 (సీఎంఓ)కు నలుగురు ఉత్తీర్ణులు కాగా వారిలో జాజాపూర్ హైస్కూల్ జీహెచ్‌ఎం రాజేంద్రకుమార్ ఎంపికయ్యారు. గత నెలలో వీరిద్దరి నుంచి విల్లింగ్ లెటర్లను డీఈఓ లియాకత్‌అలీ తీసుకుని హైదరాబాద్ కార్యాలయానికి పంపించగా వారి నియామకాలపై అధికారిక ఆదేశాలు వచ్చాయి. ఆయా కాపీలను కలెక్టర్‌కు పంపించి వారిని విధుల్లోకి తీసుకున్నారు.

## బాధితుడికి ఫోన్ అప్పగింత

**మద్దూరు:** ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి సోమవారం పోలీసులు అప్పగించారు. మండలంలోని అచ్చంపల్లి గ్రామానికి చెందిన పాగాకు ఊశప్ప తన ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు సీఈఐఆర్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయగా ఐటీ కోర్ టీం ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించి అప్పగించినట్లు ఎస్‌ఐ శీనయ్య తెలిపారు.

# కోటకొండపై నిర్లక్ష్యం తగదు



దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న నామాజి

**నారాయణపేట రూరల్:** మండలంలోని కోటకొండ మండల ఏర్పాటుపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగురావు నామాజి అన్నారు. కోటకొండను మండలంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షను సోమవారం ఆయన నామాజీ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందన్నారు. చుట్టు పక్కల ఎన్నో గ్రామాలకు కేంద్రబిందువుగా ఉందని, వెంటనే ఎమ్మెల్యే చొరువ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా వత్తిడి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు కెంచె శ్రీనివాసులు, బలరాము, తిప్పిరెడ్డి, యాదగిరి, ప్రవీణ్, చెన్నప్ప, రఘువీర్‌యాదవ్, రాజు, నర్సింహులు, రవి, రాములు, కాశీనాథ్, బాలస్వామి, నర్సింహులు పాల్గొన్నారు.

# రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

**మక్తల్:** రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన పట్టణంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శివలింగప్ప(35) తన ఇంటి నుంచి గొర్రెల మంద వద్దకు బయలుదేరాడు. ఇదే సమయంలోనే పట్టణానికి చెందిన ఆనంద్, భానుప్రసాద్ తమ వ్యవసాయ పొలం నుంచి ఇంటికి బయలుదేరారు. ఇదే క్రమంలో పట్టణ సమీపంలోని తిరుమలయ్య చెరువు కట్ట వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో శివలింగప్ప అక్కడికక్కడే మృతి చెందగా, ఆనంద్, భానుప్రసాద్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

## ముగిసిన సమ్మర్ క్యాంపు

**ధన్వాడ:** మండల కేంద్రంలో 15 రోజుల పాటుగా బాలుర ఉన్నత పాఠశాలలో నీడా ఆర్గనైజేషన్‌లో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్, స్పోకెన్ ఇంగ్లీష్, బేసిక్ సామర్థ్యంపై నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరల్ అధికారి నాగార్జున రెడ్డి, ఎంపీటీసీలు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, మాధవిలో పాల్గొని విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.

# వీఓఏల సమ్మె విరమణ



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

**మక్తల్:** సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం వీఓఏలు విరమించారు. అంతకుముందు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని వీఓలు కలిసి వినతిపత్రం అందజేసి డిమాండ్లపై చర్చించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు వీఓఏలు ప్రకటించారు. 29 రోజులుగా చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, సంతోష రాంరెడ్డి, రాజు, రాము,, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.